క్లుప్తంగా

త్రైత సిద్ధాంత ప్రచారం



పాయకాపురం(విజయవాడరూరల్): త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ ఆధ్వర్యాన సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఎల్బీఎస్ నగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో కమిటీ సభ్యులు చేశారు. యోగి ప్రబోధానంద యోగపీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కమిటీ నగర అధ్యక్షుడు జగీరపు సురేష్, సభ్యులు రమేష్, నాగరాజు, అప్పలనరసమ్మ, ఉమా, సూరప్పడు, సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సర్వజన రక్షకుడు పరమేశ్వరుడు : చింతలపాటి



విజయవాడకల్చరల్: సర్వజన రక్షకుడు పరమేశ్వరుడని ఆధ్యాత్మికవేత్త చింతలపాటి వెంకటేశ్వరశాస్త్రి అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75 వ వర్ధంతి సందర్భంగా శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి ఆదేశంతో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తితో సాగుతున్నాయి. సోమవారం వెంకటేశ్వరశాస్త్రి శివపురాణం వినిపించారు. పరమేశ్వరుడు భక్త సులభుడని తెలిపారు. అష్టాదశ పురాణాల్లో శివపురాణం ప్రధానమైదని తెలిపారు. 24 వేల శ్లోకాలతో ఉంటుందన్నారు. శివుని మారేడు దళాలతో పూజించడం సంప్రదాయమన్నారు. ఉదయం దేవాలయంలో చండీహోమం, నవచండీ పారాయణం జరిగింది. క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

యూబీఐ ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో సోమవారం ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాదారులకు ఎంఎస్ఎంఈ సేవలు, ఎంఎస్ఎంఈ సమర్థత, సామర్థ్యం, భారత ఆర్థిక వ్యవస్థలో అవి పోషిస్తున్న పాత్రను వివరించారు. రీజనల్ హెడ్ ముప్పాల శ్రీధర్ స్వాగత ప్రసంగంతో కార్యక్రమం ప్రారంభమైంది. డెప్యూటీ జోనల్ హెడ్ రామారావు ఔట్‌రీచ్ ప్రోగ్రాంను తెలియజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఆఫీస్ ముంబయి నుంచి విచ్చేసిన చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్, డెప్యూటీ రీజినల్ హెడ్ హరీష్ బేతా మాట్లాడారు. ఎంఎస్ఎంఈ రుణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ యొక్క వివిధ శాఖల మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 5న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే 'చలో విజయవాడ' ను విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. కొండపల్లి మున్సిపాల్టీ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సమ్మె కాలపు హామీల అమలు, కార్మికుల క్రమబద్ధీకరణ, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపు వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. మున్సిపాల్టీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు సైన్స్‌ఫెయిర్ దోహదం

ఇబ్రహీంపట్నం: సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు, ఆవిష్కరణలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు దోహద పడతాయని ఇండియన్ ఫిలిం ఫెస్టివల్ ఫౌండర్ లక్కరాజు వంశీ తెలిపారు. స్థానిక సెవెంత్ డే అడ్వంటిస్ట్ పాఠశాలలో సైన్స్ ఫెయిర్– 2025 సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన సైన్స్‌ఫెయిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి విద్యార్థులను సైన్స్ ఫెయిర్‌లో భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

నిలువ నీడ కరువు

- బస్‌షెల్టర్‌లు లేక మండుటెండల్లో అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ఉన్న బస్‌షెల్టర్‌లను ఆక్రమించుకున్న చిరు వ్యాపారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భానుడి భగభగలు అప్పుడే మొదలయ్యాయి. ఎండ తాకిడికి ఆరుబయటకు రావడమే కష్టంగా ఉందనుకుంటే బస్‌స్టాప్‌ల వద్ద మండుటెండల్లో గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి. నిప్పులు చిమ్మే ఎండలైనా.. జోరు వానలైనా నిలబడేందుకు కనీసం నిలువ నీడ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, పాయకాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు బస్‌షెల్టర్‌లు లేక పడుతున్న అవస్థలు ఇవి.



సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి బీసెంట్‌రోడ్డు వైపునకు వెళ్లే బస్‌స్టాప్ వద్ద రోడ్డుపైనే వేచి చూస్తున్న ప్రయాణికులు



డాబాకొట్లు సెంటర్ నుంచి నూజివీడుకు వెళ్లే బస్‌షెల్టర్ వద్ద చిరువ్యాపారులు ఉండటంతో రోడ్లపై నిలబడ్డ ప్రయాణికులు

నిత్యం వేలమంది ప్రయాణికులు రాకపోకలు

స్థానిక 57వ డివిజన్ నుంచి 64వ డివిజన్ వరకూ ఉన్న ఎనిమిది డివిజన్లలో లక్షన్నరకు పైగా జనాభా నివసిస్తున్నారు. సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, పైపులరోడ్డు, శాంతినగర్, ప్రశాంతినగర్, సుందరయ్యనగర్, ఎల్బీఎస్ నగర్, రాజీవ్‌నగర్, ఉడా కాలనీ కండ్రిక పరిసర ప్రాంతాల నుంచి వేలమంది విద్యార్థులు తమ పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. పేద, మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా నివసిస్తున్న ఈ ప్రాంతాల నుంచి వేలమంది మహిళలు, పురుషులు బీసెంట్ రోడ్డు, గాంధీనగర్, కాళేశ్వరరావు మార్కెట్, వన్‌టౌన్ ప్రాంతాల్లో పనులు చేసుకునేందుకు వెళ్లి వస్తుంటారు. వీరిలో ముప్పావు వంతు వారంతా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ఉంటారు.

బస్‌షెల్టర్‌ల ఊసే మరిచారు

సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్, కృష్ణా హోటల్ సెంటర్, గంగానమ్మ గుడి, ఇటు న్యూఆర్‌ఆర్‌పేటకు వెళ్లే దారిలో అటు వాంబే కాలనీకి వెళ్లే దారిలో, సింగ్‌నగర్ పైపులరోడ్డు నుంచి కండ్రిక, నున్న, నూజివీడు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులంతా ఇక్కడి బస్‌స్టాప్‌ల వద్దకు వస్తారు. అయితే ఈ ప్రాంతాలలో ఎక్కడా బస్‌షెల్టర్‌లు లేకపోవడంతో ఎండైనా.. వానైనా ప్రయాణికులు అలా నడిరోడ్లపైనే వేచిచూడాల్సి వస్తుంది.

ఆక్రమణలకు గురై అక్కరకు రాని బస్‌షెల్టర్లు

సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి కండ్రిక, నూజివీడు ప్రాంతాల వైపునకు వెళ్లే బస్‌స్టాప్‌ల వద్ద, పైపులరోడ్డులోని తారా స్వీట్స్ ఎదురు ఉన్న బస్‌షెల్టర్‌లను చిరు వ్యాపారులు ఆక్రమించుకోగా, ఆకతాయిలు ఆ షెల్టర్‌లే అడ్డాలుగా మార్చుకున్నారు. ప్రయాణికుల కోసం నిర్మించిన ఈ బస్‌షెల్టర్‌లను వ్యాపారాలకు, ఇతరత్రా కార్యకలాపాలకు వాడేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు వదిలే వేళల్లో ఆకతాయిలు ఈ షెల్టర్‌లలో తిష్టవేసి అల్లర్లకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఆయా బస్‌షెల్టర్‌ల వద్ద ఆక్రమణలు తొలగించి, వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బస్‌షెల్టర్‌లు లేవు



న్యూరాజరాజేశ్వరీపేట నుంచి సింగ్‌నగర్, బీసెంట్ రోడ్డు ప్రాంతాలకు వెళ్లి వచ్చే మార్గాలలో ఎక్కడా బస్‌షెల్టర్‌లు లేవు. అపార్ట్‌మెంట్‌ల ప్రాంతం, వంతెన వద్ద, డాబాకొట్లు సెంటర్ వద్ద ఒక్క బస్‌షెల్టర్ కూడా లేకపోవడంతో నడిరోడ్డుపైనే వేచి చూడాల్సివస్తోంది. బస్‌షెల్టర్‌లు ఏర్పాటుచేస్తే ప్రయాణికులందరికి ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎం.చైతన్యరెడ్డి విద్యార్థి, న్యూరాజరాజేశ్వరీపేట

ఎండైనా.. వానైనా నడిరోడ్డుపైనే...



బస్‌షెల్టర్‌లు లేకపోవడం వల్ల ఎండైనా.. వానైనా నడిరోడ్లపైనే నిలబడాల్సివస్తుంది. కొన్ని చోట్ల బస్‌షెల్టర్‌లు ఉన్నా అవి చిరు వ్యాపారుల ఆక్రమణలతో నిరుపయోగంగా మారాయి. ఉచిత బస్సు సౌకర్యం సంగతి పక్కన పెడితే కనీసం ప్రయాణికులకు కనీస సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– దేవి కేశవాణి, టీచర్, ఇందిరానాయక్‌నగర్

దేశవ్యాప్తంగా బీఓఐ 111 నూతన శాఖలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి సోమవారం దేశవ్యాప్తంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా 111 నూతన శాఖలను ప్రారంభించిందని ఆ బ్యాంకు విజయవాడ జోన్ జోనల్‌మేనేజర్ ఎంవీ బంగార్రాజు తెలిపారు. ఏలూరు రోడ్డు చుట్టుగుంటలోని బ్యాంక్ ఆఫ్ఇండియా జోనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ రజనీష్ కర్నాటక్ చేతుల మీదుగా దేశవ్యాప్తంగా 111 నూతన శాఖలను ప్రారంభమయ్యాయన్నారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 211 నూతనశాఖలతో పాటు దేశ వ్యాప్తంగా 5301 శాఖల మైలురాయిని బ్యాంకు సాధించిందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బ్యాంక్ ఆఫ్ ఇండయా ఉనికిని పెంచడానికి, ఈ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలో 11, ఏపీలో 6 నూతన శాఖలు ప్రారంభించారని తెలిపారు.

మహిళల భద్రతపై వ్యాసరచన పోటీలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారత వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఎస్ఎన్‌పురం పోలీసులు సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఘనంగా జన్ ఔషధి దివస్ వారోత్సవాలు



జన్ ఔషధి దివస్‌లో పాల్గొన్న చిన్నారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జన్ ఔషధి దివస్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని పలు పాఠశాలలకు చెందిన చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జన్ ఔషధి ప్రయోజనాలను తెలియజేశారు. రాబోయే తరాలకు జన్ ఔషధి సందేశాన్ని వ్యాప్తి చేయడానికి పీఎం నరేంద్రమోదీ చొరవతో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15వేల కంటే ఎక్కువ జన్ ఔషధి కేంద్రాలు ప్రారంభమయ్యాయని, 2027 మార్చి31 నాటికి దేశవ్యాప్తంగా 25వేల జన్ ఔషధి కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. జనరిక్ ఔషధాలను ప్రోత్సహించటానికి, ఏటా మార్చి 7వ తేదీన జన్ ఔషధి దివస్‌గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ కో ఆపరేటివ్ సహకార అధికారి కిరణ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ అల్లు హరికృష్ణ, ప్రసాదరావు, ఆర్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలి

మైలవరం: విద్యార్థులు ఆర్థిక శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నారాయణరావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు అధ్యక్షతన కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ షేక్ కరీముల్లా అతిథి ఉపన్యాసం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో పరిశ్రమలు స్థాపించడానికి ఈ అంశాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.శ్రీనివాసరావు, కే హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపకుడిని సన్మానించారు.

చెవి, వినికిడి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి

డాక్టర్ మాచర్ల సుహాసిని

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ చెవి, వినికిడి ఆరోగ్యం సంరక్షించుకోవాలని చెవి ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అధికారి డాక్టర్ మాధవీనాయుడు పర్యవేక్షణలో వినికిడి ఆరోగ్యం, శబ్ద గ్రాహ్యత, అతి శబ్దంతో కలిగే నష్టాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను మరో పదిమందికి తెలియజేస్తే ఆరోగ్యకర సమాజ స్థాపనకు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో వినికిడి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మధురానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాచర్ల సుహాసిని

పన్నులు కడుతున్నా... పాలన సున్నా

సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర వాసులు పన్నులు కడుతున్నా.. సుపరిపాలన అందించలేని దుస్థితికి నగరపాలక సంస్థ దిగజారిందని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. హనుమాన్‌పేట దాసరి భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము కౌన్సిల్‌లో అధికారంలో ఉండగా రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి నిధులు రాబట్టి, నగరాన్ని అభివృద్ధిలో ముందుకు నడిపించామని గుర్తుచేశారు. నగరంలో ఆర్ఐ, బిల్ కలెక్టర్లు ఆయా ప్రాంతాల ఇంటి యజమానులను ఇంటి పన్నులు కట్టాలని వత్తిడి తెస్తున్నారని చెప్పారు. వీఎంసీ లోగోలో ట్యాక్స్ టు వర్క్ అని ఉందని, పన్నులు కడుతున్నాం... పాలన ఎక్కడని అడిగే దుస్థితిని అధికారులు కల్పించవద్దన్నారు. ఎండాకాలం పూర్తిగా ప్రారంభం కాకుండానే 'కలుషిత మంచినీరు' విపరీతమైన దోమలతో ప్రజలు నానాయాతన పడుతున్నారన్నారు.

మరోవైపు సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్ కు చెత్తను తరలించేందుకు వాహనాలు లేవని ఆఫీసర్లు చెప్పినా ఫలితం లేదన్నారు. దీనిపై నగరంలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇన్‌చార్జి మంత్రి నైతిక బాధ్యత వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి, నగర ప్రజలకు దీటిన పాలనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే భవిష్యత్తులో ప్రజా సమస్యలపై ఆందోళనకు ప్రజలను సమాయత్తం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్మికులకు కార్పొరేషన్ నేరుగా జీతాలు ఇవ్వాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): అవుట్‌సోర్సింగ్ కార్మికులతో పని చేయించుకునే నగరపాలక సంస్థే వారికి నేరుగా జీతాలు చెల్లించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. సోమవారం 44వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షుడు ఎస్కేస్ చలం, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్ మాట్లాడారు. సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు కనీస వేతనంగా రూ.26 వేలకు తక్కువగా ఉండకూడదన్నారు. అయితే తమ వద్ద నిధులు లేవనే సాకుతో ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ కనీస వేతనం చట్టాన్ని అమలు చేయడం లేదన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్యుత్ బిల్లులతో సామాన్యులు బతకటం కష్టతరంగా ఉందన్నారు. ప్రజలపై భారాలు మోపే ప్రభుత్వం వారి జీతాలు పెంచే విషయంలో చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను గౌరవించి తక్షణమే పారిశుద్ధ్య కార్మికులకు రూ.26వేలకు జీతం పెంచి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న రాజా

● ఉత్సాహంగా.. ఉల్లాసంగా...







నిత్యం రోగుల సేవల్లో మమేకమయ్యే సిబ్బంది సోమవారం కాసేపు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో మహిళా సిబ్బందికి పలు రకాల పోటీలు నిర్వహించారు. ఫ్యాన్సీడ్రెస్ కాంపిటీషన్స్, సింగింగ్, వక్తృత్వం వంటి పోటీల్లో ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు.

–లబ్బీపేట(విజయవాడతూర్పు)



గిరిప్రదక్షిణ మార్గంలో బస్సు తిరిగేనా..!

- దేవస్థాన బస్సు కోసం ఎదురు చూపులు
- కూటమి ప్రభుత్వం రాకతో అటకెక్కిన ప్రతిపాదనలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి చుట్టూ దేవస్థానం బస్సు ఇప్పట్లో తిరిగేలా కనిపించడం లేదు. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మార్గంలో బస్సు సదుపాయం కల్పించాలని గతంలో దేవస్థానం నిర్ణయించింది. దుర్గాఘాట్ మొదలుకుని కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా జంక్షన్, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకునేలా రూట్‌ప్లాన్ సైతం రూపొందించారు. గతంలో ఈఓగా బాధ్యతలు నిర్వహించిన రామారావు, చైర్మన్ కర్నాటి రాంబాబు ఈ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ మేరకు దేవస్థానం వద్ద ఉన్న బస్సుతో పలుమార్లు ట్రయల్ రన్ నిర్వహించడంతో పాటు ఏ ప్రాంతాల్లో బస్‌స్టాప్‌లతో పాటు రోజు ఎన్ని పర్యాయాలు తిరగాలనే దానిపై సమాలోచనలు సైతం జరిగాయి. గిరి ప్రదక్షిణ మార్గంలో తిరిగే బస్సును సైతం దాతలు అందించేందుకు ముందుకు వచ్చారు. అయితే ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే లోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలు అటకెక్కినట్లు తెలుస్తోంది.



దుర్గగుడికి వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్ (ఫైల్)

ఎంతో ఉపయోగం

గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థాన బస్సును ఏర్పాటు చేయడం వల్ల పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా వన్‌టౌన్, కొత్తపేట, చిట్టినగర్, ఊర్మిళనగర్‌తో పాటు భవానీపురం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, గృహిణులు నిత్యం ఇంద్రకీలాద్రికి వెళ్లి దుర్గమ్మను దర్శించుకున్న అనంతరమే తమ పనులు, వ్యాపారాలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారి ఆలయానికి చేరుకోవాలంటే మహా మండపం వరకు, లేదా ఘాట్‌రోడ్డులో కొండపైకి చేరుకోవాల్సి ఉంటుంది. అదే దేవస్థానం బస్సు సదుపాయం కల్పించినట్లయితే మరింత సులభంగా ఆలయానికి చేరుకునే వీలు కలుగుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ మార్గంలో దేవస్థానం బస్సు సదుపాయం కల్పించినట్లయితే రైల్వే స్టేషన్ వెస్ట్ బుకింగ్, తారా పేట వైపు వచ్చే యాత్రికులకు సైతం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని దుర్గమ్మ భక్తులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న బస్సులు రైల్వే స్టేషన్ తూర్పు వైపునకు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

బస్సు సదుపాయంతో ప్రయోజనాలు ఎన్నో.. దుర్గగుడి, ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ మార్గంలో బస్సు సదుపాయం కల్పించడం వల్ల భక్తులకు ఎన్నో ప్రయోజనాలు ఉండటంతో పాటు దేవస్థానానికి మరింత ఆదాయం పెరిగే అవకాశాలు లేకపోలేదు. దేవస్థానం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ తారాపేటకు కూతవేటు దూరంలో సీవీరెడ్డి చారిటీస్ కాటేజీలు అందుబాటులో ఉన్నాయి. ఆ కాటేజీలకు వెళ్లాలంటే బస్టాండ్, రైల్వే స్టేషన్ నుంచి వచ్చే వారికి అంతగా తెలియడం లేదు. గిరి ప్రదక్షిణ మార్గంలో బస్సును ఏర్పాటు చేయడం వల్ల ఆ బస్సు పంజా సెంటర్ మీదగా రైల్వే వెస్ట్ బెకింగ్, అక్కడి నుంచి సీవీరెడ్డి చారిటీస్‌కు మళ్లించవచ్చు. సీవీరెడ్డి చారిటీస్ కాటేజీలో విశ్రాంతి తీసుకున్న భక్తులు నేరుగా దేవస్థాన బస్సులో ఆలయానికి చేరుకునే వీలు కలుగుతుంది. బహుళ ప్రయోజనాలు ఉన్న ఈ బస్సు రూట్‌పై దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు మరో మారు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కళాశాల స్థాయిలో ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసం కలిగి ఉండాలని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కంద్రగుంట రామకృష్ణయ్య తెలిపారు. కేతనకొండ ఆర్కే కళాశాలలో ఏఐఎంఎల్, డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో కెరీర్ కౌన్సెలింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెరీర్‌లో ఎలా సక్సెస్ అవ్వాలి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రాముఖ్యత, ఇంటర్వ్యూ సమయాల్లో ఉండాల్సిన లక్షణాల గురించి విద్యార్థులకు వెల్లడించారు. పవర్‌ప్లే ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలు వివరించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. వివిధ విభాగాధిపతులు షేక్ షబాజ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ శాఖల అధిపతులు, సచివాలయ ఉద్యోగులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శానిటేషన్, ప్లానింగ్, ఎమినిటీస్ సెక్రటరీలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎమినిటీస్ అందరూ సకాలంలో పన్నులు చేయాలన్నారు.

ప్రతి సచివాలయం పరిధిలో ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలని పేర్కొన్నారు. అధికారులు సచివాలయ ఉద్యోగులను పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన సహకారాన్ని అందించాలని సూచించారు. ఫీల్డ్ లెవెల్‌లో ఉన్న ప్రతి చిన్న సమస్యను పూర్తి స్థాయిలో గమనించి సంబంధిత అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకుని పరిష్కరించేలా చూడాలన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

ఆస్తి ఇవ్వాలంటూ తండ్రిపై దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పొలం అమ్మి ఆస్తి ఇవ్వాలని తనపై దాడి చేయడంతోపాటు చంపేస్తానంటూ తన కుమారుడు బెదిరిస్తున్నారంటూ సోమవారం గుణదల పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ రమాదేవి స్కూల్ ప్రాంతానికి చెందిన మనంనేని పోతురాజుకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం. పోతురాజు కుమారుడు వెంకట రమణ కారు డ్రైవర్. పోతురాజు పేరున ఉన్న పొలం అమ్మి డబ్బులు ఇవ్వాలంటూ వెంకటరమణ తండ్రితో తరచూ గొడవ పడుతున్నారు. ఈనెల 1వ తేదీ రాత్రి ఆస్తి ఇవ్వాలంటూ తండ్రిపై దాడి చేసి చంపేస్తానంటూ బెదిరించాడు. పోతురాజు ఫిర్యాదుపై గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గుణదల రా వాటర్ పంపింగ్ ఇన్‌టేక్ వెల్ వద్దగల ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయనున్నందున ఈ నెల 5వ తేదీ సాయంత్రం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, నాగార్జున నగర్, కరెన్సీ నగర్, శ్రీరామచంద్ర నగర్, గణేష్ నగర్ కాలనీ, కామినేని నగర్, భారతీ నగర్‌లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com